## క్లుప్తంగా

### డాక్టర్ల గైర్హాజరుపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

గార్ల: 'ఆసుపత్రిలో ఒక్క డాక్టర్ లేడు' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో బుధవారం ప్రచురితమైన కథనానికి జిల్లా డీసీహెచ్ఎస్ బి.వెంకట్రాములు గార్ల సీహెచ్సీలో విచారణ చేపట్టారు. మంగళవారం పినిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఓ యువతి పురుగుమందు తాగి వైద్యం కోసం ఆసుపత్రికి వస్తే ఆసయమంలో కనీసం ఒక్క డాక్టర్ కూడా లేకపోవడం అనే అంశంపై ఆయన విచారణ చేపట్టారు. 30 పడకల ఆసుపత్రిలో సాయంత్రం 5 గంటల సమయంలో డాక్టర్లు ఎవరూ లేకపోవడంతో డాక్టర్లపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఆసుపత్రిలో డాక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇక నుంచి విధుల పట్ల నిర్లక్ష్యం వహించడం, గైర్హాజరు అయితే సహించేది లేదని డాక్టర్లను హెచ్చరించారు. విచారణ తుది నివేదికను రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ కమిషనర్‌కు పంపనున్నట్లు జిల్లా డీసీహెచ్ఎస్ బి.వెంకట్రాములు తెలిపారు.

### న్యాయవాదులు విధుల బహిష్కరణ

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా కోర్టులో పనిచేస్తున్న ఓ పబ్లిక్ ప్రాసిక్యూటర్ న్యాయవాదులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తూ న్యాయవాదులు బుధవారం విధులు బహిష్కరించారు. సదరు పీపీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిని కలిసి విన్నవించారు. పీపీ విధులు సక్రమంగా నిర్వహించడం లేదనే విషయంలో బదిలీ చేయాలని కోరారు. అదేవిధంగా హైదరాబాదులో గల డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

### విద్యార్థినులకు మంత్రి అభినందన




విద్యార్థినులను అభినందిస్తున్న మంత్రి సీతక్క

మహబూబాబాద్ అర్బన్/కురవి: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన కేంద్రానికి చెందిన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని తేజావత్ అక్షితను, కురవి ఏకలవ్య రెసిడెన్షియల్‌కు చెందిన విద్యార్థినులు సంగీత, సమీరలను హైదరాబాద్ గిరిజన భవన్ బుధవారం మంత్రి సీతక్క, ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ సన్మానించి ప్రశంస పత్రాలను అందజేశారు.

### ధర్నా విరమణ



డోర్నకల్: స్థానిక రైల్వే ఏడీఈఎన్ కార్యాలయం ఎదుట రెండు రోజులుగా చేపట్టిన ధర్నాను మజ్దూర్ యూనియన్ నాయకులు బుధవారం విరమించారు. రైల్వే అధికారులు ఈనెల 23న సమన్వయ సమావేశం నిర్వహిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో రవీందర్, ఆవుల యుగేందర్, రావుల సమ్మయ్య, రాజేందర్, అంజియాదవ్, శ్రీనివాస్ సంపత్‌రావు, చరణ్‌నాయక్, వెంకట్, ముకుందం, జానీ పాల్గొన్నారు.

### 'పొంగులేటి'ని కలిసిన నాయకులు



మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

మరిపెడ రూరల్: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని హైదరాబాద్‌లో డోర్నకల్ నియోజక వర్గ కాంగ్రెస్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నాయకులు నూకల అభినవ్‌రెడ్డి, రాంలాల్, సంపెట రాము, షేక్ అప్జల్, మురళీధర్‌రెడ్డి, ఉత్తేజ్ వర్మ ఉన్నారు.

### బంగారం దుకాణంలో చోరీ

కురవి: మండల కేంద్రంలోని వినాయక జ్యూవెలరీ(బంగారు దుకాణం)లో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. చెట్టుకొమ్మను నిచ్చెనగా ఉపయోగించుకుని షాపు వెనుక ఉన్న వెంటిలేటర్‌ను ధ్వంసం చేసి షాపులోకి చొరబడి షాపులో ఉన్న ఒక కేజీ వెండి, ఆరుగ్రాముల బంగారు ఆభరణాలు అపహరించారు. బుధవారం ఉదయం యజమాని అడాన్య వీరన్న షాపు తీసి చూసేసరికి చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని కురవి పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్సై గండ్రాతిసతీష్, పీఎస్సై కృష్ణారెడ్డి, సిబ్బంది వెంటనే క్లూస్‌టీం, ఫోరెన్సిక్ బృందాలు పరిసరాలను పరిశీలించారు. బాధితుడు అడాన్య వీరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పీఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. చోరీకి గురైన సొత్తు విలువ రూ.1.10లక్షలు ఉంటుందని పీఎస్సై తెలిపారు.

# వనమహోత్సవానికి సిద్ధం

- 39జీపీల నర్సరీల్లో 2025లక్షల మొక్కల పెంపకం
- ప్రత్యేక దృష్టిసారిస్తున్న అధికారులు

గూడూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా ప్రతీ గ్రామంలోని నర్సరీలలో మొక్కల పెంపకం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ప్రతీ గ్రామపంచాయతీ నర్సరీలో లక్ష్యం మేరకు మొక్కలు పెంచేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మండలంలోని మొత్తం 39 గ్రామపంచాయతీలలో ప్రతీ నర్సరీలో 6500 మొక్కలు పెంచే విధంగా అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. మొత్తం మండల పరిధిలోని 39జీపీల నర్సరీల్లో 2.53లక్షల మొక్కల పెంపకమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించి పనులు చేపడుతున్నారు. జూన్ మాసం నాటికి మొక్కలను సిద్ధంగా ఉంచాలని భావిస్తున్నారు.



నాయకపల్లి నర్సరీలో పెరుగుతున్న మొక్కలు

**మొక్కలపై ప్రత్యేక దృష్టి**

వేసవిని దృష్టిలో పెట్టుకొని మొక్కల పెంపకంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఎండ వేడికి మొక్కలు ఎండిపోకుండా ప్రతీ నర్సరీకి గ్రీన్ షెడ్‌ను ఏర్పాటు చేశారు. అక్కడక్కడ ఎండిపోయిన మొక్క స్థానంలో కొత్త మొక్కలను నాటి లెక్క తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు. ప్రతీ రోజు మొక్కలకు నీరు అందిస్తూ కాపాడుతున్నారు. కలుపు మొక్కలను తొలగిస్తూ మొక్కలు ఏపుగా పెరిగేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**నర్సరీలో వివిధ రకాల మొక్కలు**

ప్రతీ నర్సరీలో ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో పండ్లు, పూలు, కలప నిచ్చే వివిధ రకాల మొక్కలను పెంచుతున్నారు. జామ, నిమ్మ, టేకు, వేప, మునగ, కానుగ, అల్లనేరడు, దానిమ్మ, బొప్పాయి, కృష్ణతులసి, సీతాఫల్, తుర్కవేప, చింత, గన్నేరు, గోరింటాకు, మందార, చామంతి, ఉసిరి, చిన్నబాదం మొక్కలతోపాటు పలురకాల పండ్ల మొక్కలను పెంచుతున్నారు. వాటి సంరక్షణకు ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటూ, రైతులు, ప్రజలకు అవసరమైన మొక్కలను పెంచుతున్నారు.

**రెండుపూటలా నీరు అందిస్తున్నాం..**



ప్రతీ నర్సరీలో 6,500మొక్కలు పెంచుతున్నాం. ఎండాకాలంలో వేడికి మొక్కలు ఎండిపోతుండగా గ్రీన్‌షెడ్‌ను ఏర్పాటు చేశాం. ఉదయం, సాయంత్రం మొక్కలకు నీరు అందించే ఏర్పాట్లు చేస్తూ, మొక్కలు ఏపుగా పెరిగేందుకు కృషి చేస్తున్నాం. నర్సరీలో మొక్కల పెంపకంతో పచ్చదనం వచ్చింది.

- బన్సీలాల్, ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ ఏపీఓ

**లక్ష్యం మేరకు మొక్కలు**



ప్రభుత్వ లక్ష్యం మేరకు మండలంలోని 39జీపీలలోని నర్సరీలలో మొక్కలు పెంచేందుకు కృషి చేస్తున్నాం. వచ్చే జూన్ నాటికి మొక్కలు ఏపుగా పెరిగేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లో నర్సరీలను సందర్శిస్తూ మొక్కల ఎదుగుదలను పరిశీలిస్తున్నాం. వన మహోత్సవంలో మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

- వీరస్వామి, ఎంపీడీఓ

## బీఆర్ఎస్ నాయకుల విమర్శలు అర్థరహితం



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

తొర్రూరు: నిస్వార్థంగా పాలకుర్తికి సేవ చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డిలపై బీఆర్ఎస్ నాయకుల విమర్శలు అర్థరహితమని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు డాక్టర్ పానుగోటి సోమేశ్వరరావు, బిల్లా సుధీర్‌రెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఝాన్సీరెడ్డి అంకితభావంతో పాలకుర్తికి సేవ చేస్తున్నారని, ఆమెపై కారుకూతలు మానుకోవాలని తెలిపారు. మాజీ మంత్రి దయాకర్‌రావు ఝాన్సీరెడ్డి దగ్గర ఆర్థిక సహకారం పొంది గతంలో ఎమ్మెల్యేగా గెలిచాడన్నారు. అభివృద్ధి పేరిట అవినీతికి పాల్పడ్డాడని, కుట్టు శిక్షణ పేరిట రూ.కోట్లు దండుకున్నాడన్నారు. ఎర్రబెల్లి అవినీతి బయటపెట్టి జైలుకు పంపుతామన్నారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యా నాయక్, మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, నాయకులు సోమ రాజశేఖర్, రవీందర్‌రెడ్డి, మంగళపల్లి రామచంద్రయ్య, జాటోతు రవి, పింగిళి ఉష, స్రవంతి, అచ్చిరెడ్డి, వెంకటాచారి, కుమార్ పాల్గొన్నారు.

### అధికారులు వచ్చిందే టైం..!



అధికారులు లేక దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

చిన్నగూడూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉదయం 10.40 గంటల వరకు కూడా అధికారులు విధులకు హాజరుకాకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన స్థానిక ప్రజలు కాసేపు అక్కడే కూర్చొని వెనుదిరిగిపోయారు. ఈ విషయమై ఎంపీడీఓ రామారావును 'సాక్షి' వివరణ కోరగా ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం వంటి పథకాల గురించి అధికారులు విజిట్‌కు వెళ్లినట్లు తెలిపారు.

## విత్తనాలు సకాలంలో అందించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సనప పొమ్మన్న, బండపల్లి వెంకటేశ్వర్లు కోరారు. సంఘం ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మచారికి బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సాగు సమయంలోనే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు రైతులకు అందుబాటులోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కన్నంతరెడ్డి భాస్కర్‌రెడ్డి, సాయిలు, వెంకన్న, కోటమ్మ, జివ్వాజీ బాలయ్య, ఖాజాపాష, గణేశ్ పాల్గొన్నారు.

## ఉపాధి పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న నాగయ్య

గార్ల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్ర బడ్జెట్‌లో రూ.2.50లక్షల కోట్లు కేటాయించి పటిష్టంగా అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య డిమాండ్ చేశాడు. గార్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధి చట్టానికి కేటాయింపులు స్తంభించిపోయాయని పేర్కొన్నారు. ఆహార భద్రత పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించడానికి ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద పనిచేసిన కూలీలకు 45రోజుల నుంచి వేతనాలు చెల్లించకుండా కూలీలను ఇబ్బందులకు గురిచేయడం ప్రభుత్వానికి తగదన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మండ రాజన్న, జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య, ఉపాధ్యక్షుడు యాకూబ్, వెంకన్న, పెద్దవెంకటేశ్వర్లు, బ్రహ్మచారి, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

## 'బాలామృతం'లో బల్లిపై అధికారుల విచారణ



గొల్లగూడెంలో విచారణ చేస్తున్న సీడీపీఓ

గూడూరు: చిన్న పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారమైన బాలామృతం ప్యాకెట్‌లో చనిపోయిన బల్లి కనిపించిన సంఘటన మండల కేంద్రంలోని గొల్లగూడెంలో మంగళవారం జరిగింది. చిన్నారి దేవాన్ష్ తల్లి ప్రియాంక తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల మొదటివారం అంగన్‌వాడీ టీచర్ సువర్ణ చిన్న పిల్లలకు అందించే బాలామృతం ప్యాకెట్ ప్రియాంకకు ఇచ్చారు. చిన్నారికి బాలామృతం పెడదామని ప్యాకెట్ విప్పి బౌల్‌లో పోయగా అందులో చనిపోయిన బల్లి కనిపించింది. దీంతో అవాక్కయిన ప్రియాంక వెంటనే అంగన్‌వాడీ టీచర్ సువర్ణకు సమాచారం అందించారు. బుధవారం సమాచారం అందుకున్న సీడీపీఓ నీలోఫర్ అజ్మీ గొల్లగూడెంలోని ప్రియాంక ఇంటికి వెళ్లి బాలామృతం ప్యాకెట్‌లో బల్లి కనిపించిన విషయమై అడిగి తెల్సుకున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తామని తెలిపింది.

## పార్టీ బలోపేతానికి నిర్మాణాత్మక పోరాటాలు




మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

మరిపెడ: క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి నిర్మాణాత్మక పోరాటాలు కొనసాగించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లూ సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మరిపెడలో జరిగిన పార్టీ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదకొండు సంవత్సరాలుగా పరిపాలిస్తున్న కేంద్ర ప్రభుత్వం నిత్యావసర సరకుల ధరలు తగ్గించలేకపోయిందన్నారు. అనంతరం సీపీఐ మరిపెడ పట్టణ కార్యదర్శిగా మల్లేపాక యాకన్న, సహాయకార్యదర్శిగా పగిళ్ల అంజయ్యలతోపాటు మరో ఏడుగురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అక్కినపల్లి రాములు. సీపీఐ మండల కార్యదర్శి బాలకృష్ణ. నెల్లుట్ల నారాయణ, వెకన్న, సైదులు పాల్గొన్నారు.

## సర్వే రెమ్యునరేషన్ చెల్లించాలి




కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

మహబూబాబాద్ అర్బన్: గత ఏడాది నవంబర్ 6నుంచి 18వరకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న జిల్లా ఉపాధ్యాయులకు, ఇతర సిబ్బందికి కుల గణన సర్వే రెమ్యునరేషన్ చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి డిమాండ్ చేశాడు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మురళీకృష్ణ, యాకూబ్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు బి.హరినాయక్, జనార్దన్, మంజుల పాల్గొన్నారు.

### అమృత్ మిత్ర 2.0 ప్రారంభం

నర్సంపేట: పట్టణంలోని కుమ్మరికుంట చెరువు వద్ద అమృత్ మిత్ర 2.0 కార్యక్రమాన్ని బుధవారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కుమ్మరికుంట చెరువును సందర్శించి చెరువు దగ్గరలో ఉన్న ధరణి, సృష్టి స్లం సమాఖ్యల ఎదుట సంఘాల మహిళలతో చెట్లు నాటించడానికి కమిషనర్ అమృత్ మిత్ర 2.0 కిట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఏఈ రాజేష్, మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

## రాజీవ్‌గాంధీ ఆశయాలను సాధించాలి

భారత మాజీ ప్రధాని, భారతరత్న అవార్డు గ్రహీత రాజీవ్‌గాంధీ వర్ధంతిని బుధవారం కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఆయన విగ్రహం, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. దేశం కోసం సాంకేతిక వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకువచ్చి, దేశానికి ఐటీని పరిచయం చేసిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందన్నారు. రాజీవ్‌గాంధీ ఆశయాలను సాధించాలని పేర్కొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ రూరల్: రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



బయ్యారం: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య



డోర్నకల్‌లో..



కురవి: సీరోలు మండల కేంద్రంలో..



పెద్దవంగరలో..

## సంక్షిప్త సమాచారం

**సన్మానం**

మరిపెడ రూరల్: మరిపెడ డివిజన్ ఆత్మచైర్మన్‌గా నల్లు సుధాకర్‌రెడ్డిని ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ నియమించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి సివిల్ సప్లయ్ హమాలీలు బుధవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మారగాని బాలకృష్ణ, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

**ఉపాధ్యాయులకు శిక్షణ**

డోర్నకల్: బోధనా నైపుణ్యాలపై స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. ఎంఈఓ ఆంగోత్ లక్ష్మానాయక్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలపై అవగాహన పెంచుకోవాలన్నారు.

**ఎమ్మెల్యే పరామర్శ..**

చిన్నగూడూరు: మండలంలోని గుండంరాజుపల్లి గ్రామానికి చెందిన కామ్రేడ్ గునిగంటి బుచ్చయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య బుధవారం మండలంలోని గుండంరాజుపల్లిలో బుచ్చయ్య నివాసానికి చేరుకుని ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించాడు. అనంతరం వారి కుమారులు సీపీఎం జిల్లా కార్యదర్శి గునిగంటి రాజన్న, జిల్లా నాయకులు జగన్, జిల్లా కార్యవర్గ సభ్యులు మోహన్, డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కమలాకర్‌లను పరామర్శించారు.

బయ్యారం: విద్యుదాఘాతంతో మరణించిన నవవరుడు ఇస్లావత్ నరేష్ కుటుంబాన్ని ఎమ్మెల్యే కోరం కనకయ్య బుధవారం పరామర్శించారు. ప్రభుత్వపరంగా అందే సాయంపై అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఆయన వెంట సొసైటీ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డితోపాటు నాయకులు ప్రవీణ్, నాగేశ్వరరావు, ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

**వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు**



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని వేమునూరు గ్రామ శివారు రాముతండాకు చెందిన బానోత్ బాలు అదృశ్యమైన ఘటనలో అతడి కుమారుడు బాసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు రూరల్ ఎస్సై వి.దీపిక బుధవారం రాత్రి తెలిపారు. చిరువ్యాపారం చేసే బాలు ప్రతిరోజు వరంగల్ వెళ్లి వస్తుంటాడని, ఈ క్రమంలో ఆయన మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరి వెళ్లి బుధవారం సాయంత్రం వరకు రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు.

**పంతుల్యతండాలో ఒకరు..**



గూడూరు: మండలంలోని గుండెంగ శివారు పంతుల్యతండాకు చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై గిరిధర్ రెడ్డి బుధవారం తెలిపారు. వివరాల ప్రకారం తేజావత్ భద్రు అనే వ్యక్తి మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. తిరిగి రాత్రి ఇంటికి రాకపోవడంతో బంధువులు, గ్రామంలో వెతికారు. ఎక్కడా కనిపించకపోవడంతో భార్య తేజావత్ నీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అతడి ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్ 87126 56963, సీఐ గూడూరు 87126 56960, ఎస్సై గూడూరు 8712656962 నంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు.

**రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు**

బయ్యారం: మండలంలోని ఇల్లెందు-మహబూబాబాద్ ప్రధాన రహదారిపై నామాలపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి జిల్లా ఇల్లెందు మండలం మామిడిగుండాలకు చెందిన బంగారు అశోక్ రోడ్డుదాటుతున్న సమయంలో మోటర్‌సైకిల్ వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అశోక్‌ను చికిత్స నిమిత్తం 108వాహనంలో మహబూబాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

**చికిత్స పొందుతున్న హోంగార్డు మృతి**

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన హోంగార్డు సత్తూరి అశోక్(36) అనే వ్యక్తి ఇటీవల క్రిమిసంహారకమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సత్తూరి అశోక్ ఖమ్మంజిల్లా కేంద్రంలో పోలీస్ హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ, భార్య సృజన, ఇద్దరు పిల్లలతో అక్కడే ఉంటున్నాడు. ఈక్రమంలో వారంరోజుల క్రితం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, అతడిని హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

**ఐటీడీఏ ద్వారా ఫలాలు అందించాలి**

గార్ల: ఐటీడీఏ ద్వారా గిరిజనుల అభివృద్ధి కోసం ఫలాలు అందించాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు అజ్మీర వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. బుధవారం గార్లలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సంపత్, జీవన్, వినోద్, నవీన్, తదితరులు పాల్గొన్నారు

**బెల్లం పట్టివేత.. కేసు నమోదు**

నర్సింహులపేట: మండలంలోని పెద్దనాగారం శివారు గోపతండాలో ఒక క్వింటాబెల్లం, 240 కేజీల పటిక పట్టుకున్న ఘటనలో ముగ్గురిపై బుధవారం రాత్రి కేసు నమోదు అయినట్లు ఎస్సై మాలోతు సురేష్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పెద్దనాగారం శివారు గోపతండాలో సమాచారం మేరకు బుధవారం అజ్మీర కోటయ్య ఇంట్లో సిబ్బందితో కలిసి తనిఖీ చేసి, వెంటనే వాటిని సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

**మహా హారతి పూజలు**



మహబూబాబాద్ రూరల్: ఆలియా భాయ్ హోల్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక శ్రీరామ ఆలయంలో బుధవారం మహాహారతి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలియా భాయ్ హోల్కర్ ఉత్సవ కమిటీ జిల్లా కన్వీనర్ వజ్జురాజు రామచంద్రరావు, పట్టణ అధ్యక్షుడు వెన్నమల్ల అజయ్, ఆకుల శ్రీనివాస్, మోసంగి మురళీ, దామోదర్ శర్మ, ఓర్సు పద్మ, ప్రభాకర్ రెడ్డి, బోయినపల్లి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

## కూలి డబ్బులు చెల్లించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న కూలీలు

చిన్నగూడూరు: ఉపాధి హామీ కూలీలకు సరైన కూలీ డబ్బులు చెల్లించలేదని ఉపాధి కూలీలు బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. మండల కేంద్రానికి చెందిన 150 మంది ఉపాధి హామీ కూలీలు 16రోజులు పని చేయగా, ఒక్కొక్కరికి రెండు రోజులకు రూ.250లు, మూడు రోజులకు రూ.350 మాత్రమే కూలీ డబ్బులు చెల్లించినట్లు వాపోయారు.